


మోపిదేవి మండలం కే కొత్తపాలెంలో దెబ్బతిన్న కంద పంట

25న పరిహారం

గ్రౌండ్ ఫ్లోర్ మునిగితే రూ.25 వేలు

- మొదటి, ఆపై ఫ్లోర్ వారికి రూ.10 వేలు
- పంట నష్ట పరిహారం ఎకరానికి రూ. 10 వేలు
- దెబ్బతిన్న వాహనాలు, పశువులకు కూడా సాయం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం సాయం ప్రకటించింది. ఈ నెల 25వ తేదీన పరిహారం అందజేయాలని నిర్ణయించింది. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత అధికారులతో పరిహారంపై సమీక్ష నిర్వహించారు. ఎన్యూమరేషన్ ఎంత వరకు వచ్చిందని అధికారులను అడిగారు. ఫ్లడ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిందని సీఎం దృష్టికి తీసుకు వచ్చారు. ఏ ఒక్క బాధితుడికి సహాయం అందలేదని చెప్పటానికి వీలు లేకుండా సమర్థవంతగా రీ వెరిఫికేషన్ కూడా పూర్తి చేశామని చంద్రబాబుకు వివరించారు. వరద బాధితులందరికీ ఈ నెల 25న పరిహారం అందజేయాల్సిందిగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సందర్భంగా మరోసారి వరద సాయంపై చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. విజయవాడలో వరదకు మునిగిన ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్‌కు రూ. 25 వేలు, మొదటి, ఆపై అంతస్తుకు రూ. 10 వేలు చొప్పున పరిహారం అందించనున్నారు. ఇళ్ల మునిగిపోయిన వారితో పాటు, వాహనాలు దెబ్బతిన్న వారికి, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం డబ్బులను బుధవారం వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయనున్నారు. ఇన్సూరెన్స్ సెటిల్‌మెంట్స్ గురించి చంద్రబాబు అధికారులను ప్రశ్నించగా మొత్తం 10 వేల వాహనాలకు గాను ఇప్పటి వరకు ఆరు వేల వాహనాలకు బీమా సెటిల్మెంట్ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. మిగిలిన వాహనాలకు కూడా బీమా పూర్తయ్యేలా చూడాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. అలాగే చనిపోయిన పశువులకు, నష్టపోయిన వ్యాపారులకు కూడా ఆర్థిక సాయం అందించనున్నారు.

యార్లగడ్డ ✗ చలసాని





32 ఏళ్లుగా పార్టీ కోసమే పనిచేస్తున్నా
విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

6లో.. **ఆంజనేయులు తప్పుడు వార్తలు రాయిస్తున్నారు**
గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

కృష్ణానది, బుడమేరు వరదలు, భారీ వర్షాలు రైతన్నలను కోలుకోలేని దెబ్బతీశాయి. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు నీటిపాలయ్యాయి. సాగు భూముల మీదుగా వరద పది రోజులకుపైగా ప్రవహించడంతో పచ్చగా కళకళలాడే పంటలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. వాణిజ్య పంటలైన పసుపు, కందతో పాటు కూరగాయల పంటలు భూమిలోనే కుళ్లిపోయి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. ఇటువంటి పరిస్థితుల్లో అన్నదాతలకు పంట నష్టపరిహారంతో పాటు పంటల బీమా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో జిల్లా అధికార యంత్రాంగం ఎంతమేర కృషి చేస్తుందనే అంశంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. వాణిజ్య పంటలపై నేటికీ స్పష్టత ఇవ్వడం లేదు. రైతులు మాత్రం పంటల బీమాపైనే తమ ఆశాలు పెట్టుకున్నారు. -ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం


చల్లపల్లి మండలంలో ఎండిపోయిన పసుపు తోట

పంటల బీమాపైనే ఆశలు

- వాణిజ్య పంటలకు రూ.2.50లక్షల వరకు పెట్టుబడి
- భూమిలోనే కుళ్లిపోయిన పసుపు, కంద పంటలు
- నీటిలో నాని చనిపోయిన వరి, కూరగాయల పైర్లు
- కొలిక్కిరాని నష్ట పరిహారం అంచనాల జాబితాలు

కొలిక్కిరాని పంట నష్టం జాబితా

గత నెల 29, 30, 31వ తేదీల్లో కురిసిన భారీవర్షాల కారణంగా 25 మండలాల్లోని 410 గ్రామాల్లో 43,542 హెక్టార్లలో వరి పంట పొలాలు నీటమునిగాయి. దీంతో పాటు బుడమేరు నుంచి వరద దిగువకు రావడంతో నందివాడ, ఉంగుటూరు, గన్నవరం, పెదపారుపూడి, గుడివాడ తదితర మండలాల్లో రోజుల తరబడి వరి పొలాలు నీటమునిగి పైరు చనిపోయింది. గతంలో హెక్టారుకు రూ.17 వేలను పరిహారంగా ఇచ్చేవారు. సీఎం చంద్రబాబు హెక్టారుకు రూ.25వేలు ప్రకటించారు. అయితే పంటనష్టం అంచనాల తయారీ ఇంకా జిల్లాలో పూర్తికాలేదు. జాబితాలు తయారు చేసిన గ్రామాల్లో సామాజిక తనిఖీ ప్రక్రియ పూర్తికాలేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా పంటలు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయిలో పంట నష్టపరిహారం, పంటల బీమాను ఇచ్చి ఆదుకోవాలని జిల్లాలోని రైతులు కోరుతున్నారు.

వరదలు, భారీవర్షాలతో పంటలు కోల్పోయిన రైతన్నలు


చల్లపల్లి మండలం పాతమాజేరులో కుళ్లిపోయిన వరి పొలం

4,006.79 హెక్టార్లలో వాణిజ్య పంటలకు నష్టం

జిల్లాలోని కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, ఉయ్యూరు, పమిడిముక్కల, బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం, చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ, పామర్రు, అవనిగడ్డ, మోపిదేవి మండలాలోని 6,435 మంది రైతులు సాగు చేసిన 4,006.79 హెక్టార్లలో పసుపు, కంద, అరటి, బొప్పాయి, తమలపాకు, పూలు, ఆయిల్‌ఫాం, చెరకు, నిమ్మ, జామ, కూరగాయల తోటలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి అధికారులు ప్రాథమిక నివేదిక పంపారు.

పసుపు, కందకు భారీగా పెట్టుబడి

కృష్ణానది కరకట్ట, నది అంచువరకు ఉన్న భూములు, నదీగర్భంలోని లంకభూముల్లో పసుపు, కంద పంటలను జూన్‌లో సాగు చేశారు. వరదలు వచ్చే నాటికి పసుపుపైరు దుంపతొడిగే దశకు చేరింది. పసుపు విత్తనం నాటేందుకే రైతుకు ఎకరానికి రూ.2 లక్షలు ఖర్చు చేశారు. కౌలుగా రూ.50వేలు ముందస్తుగానే చెల్లించారు. యాజమాన్య పద్ధతుల కోసం మరో రూ.50 వేలను ఖర్చుచేశారు. వరదలు వచ్చేనాటికి పసుపు సాగుకు ఎకరానికి సొంత భూమి ఉన్న రైతుకు రూ.2.50లక్షలు, కౌలురైతుకు రూ.3లక్షల వరకు ఖర్చు అయ్యింది. ఈ పెట్టుబడి మొత్తం మట్టిలో కలసిపోయింది. అలాగే వరదల నాటికి కంద దుంప తయారయ్యేదశకు చేరింది. నవంబరులో పంటచేతికొచ్చేదని రైతులు అంటున్నారు. వాతావరణం పూర్తిగా అనుకూలిస్తే ఎకరానికి రూ.7లక్షల కుపైగా ఆదాయం వచ్చేదని చెబుతున్నారు. మళ్లీ పంట సాగుకు వచ్చే ఏడాది వరకు వేచిచూడాల్సిందే.

రాయితీపై కంద, పసుపు విత్తనాలు ఇవ్వాలి

రెండేళ్ల కిందట వరదలకు దెబ్బతిన్న పసుపు పంటకు బీమాగా ఎకరానికి రూ.70 వేల వరకు ఇచ్చారని, ఈ ఏడాది కూడా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయడంతోపాటు, రైతులతో ఈకేవైసీ కూడా చేయించారు. పంట నష్టపరిహారంగా ప్రభుత్వం ఇచ్చే నగదు వాణజ్య పంటల రైతులకు పూడదని, పంటల బీమా అందించడంతో పాటు, పసుపు, కంద విత్తనాలు రాయితీపై అందించాలని కోరుతున్నారు.

కూటమివైపు క్యూ

ఎన్టీఆర్ జిల్లా వైసీపీకి వరుస షాక్‌లు

ఉదయభాను సహా నలుగురు కార్పొరేటర్లు జనసేనలోకి..

- ఈ నెల 26న చేరేందుకు రంగం సిద్ధం
- విజయవాడ కార్పొరేషన్‌లో తగ్గుతున్న వైసీపీ బలం
- టీడీపీ కూటమికి పెరుగుతున్న కార్పొరేటర్ల సంఖ్య
- త్వరలో మరో 10 నుంచి 15 మంది కూటమి పార్టీల్లోకి జంప్
- ఓ మాజీ ఎమ్మెల్యే కూడా బీజేపీలో చేరే యోచన


శనివారం మంగళగిరిలో జనసేనాని పవన్ కల్యాణ్‌తో సామినేని ఉదయభాను

విజయవాడ-ఆంధ్రజ్యోతి/జగ్గయ్యపేట: జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేనలో చేరిక వాయిదా పడింది. తొలుత ఈనెల 22న ఆయన జనసేనలో చేరడానికి ముహూర్తం పెట్టుకున్నారు. అయితే, శనివారం జనసేన అధినేతన పవన్‌కల్యాణ్‌ను కలిసిన తర్వాత మిగిలిన నాయకులతో పాటు 26న చేరాలని నిర్ణయించుకున్నారు. ఆయనతో పాటు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన నలుగురు వైసీపీ కార్పొరేటర్లు జనసేనలో చేరనున్నారు. మహదేవు అప్పాజీ, మరుపిళ్ల రాజేశ్, అత్తలూరి ఆదిలక్ష్మి, ఉమ్మడిశెట్టి రాధిక ఈ లిస్టులో ఉన్నారు.

> ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేనలో చేరేందుకు సిద్ధం కాగా, విజయవాడ కార్పొరేషన్‌కు చెందిన నలుగురు వైసీపీ కార్పొరేటర్లు కూడా ఆయన వెంట నడుస్తున్నారు. వీరంతా ఈనెల 26న జనసేన తీర్థం పుచ్చుకుంటుండగా, నగరానికి చెందిన మరో మాజీ ఎమ్మెల్యే కూడా బీజేపీవైపు చూస్తున్నట్టు తెలుస్తోంది.

విజయవాడ కార్పొరేషన్ ఖాళీ

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వైసీపీకి 49 మంది కార్పొరేటర్ల బలం ఉంది. వీరిలో ఇప్పటికే బుల్లా విజయకుమార్, గుడివాడ నరేంద్ర రాఘవ బీజేపీలో చేరగా, మైలవరపు రత్నకుమారి, అబ్దుల్ అర్షద్ టీడీపీలో చేరారు. టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన మైలవరపు మాధురి తిరిగి సొంతగూటికి చేరారు. తాజా పరిణామాలతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 41కి పడిపోగా, కూటమి బలం 22కు చేరింది. అందులో టీడీపీకి 16, బీజేపీకి ఇద్దరు, జనసేనకు నలుగురు కార్పొరేటర్ల బలం చేకూరింది. కొద్దిరోజుల్లో మరో 10 నుంచి 15 మంది కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చేరే అవకాశాలున్నాయి. అదే జరిగితే కౌన్సిల్‌లో వైసీపీ బలం పడిపోనుంది. అయితే, నిబంధనల ప్రకారం 2025-మార్చి నాటికి వీఎంసీ పాలకమండలికి నాలుగేళ్లు నిండుతాయి. ఆ తర్వాతే అవిశ్వాసం పెట్టేందుకు అవకాశం ఉంటుంది. ఈలోపే మేయర్ కూడా వైసీపీని వీడితే, వీఎంసీపై కూటమి జెండా ఎగురుతుంది. లేకుంటే 2025-మార్చి తర్వాత కూటమి జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది.

బెజవాడపై ఉదయభాను పట్టు

కాపు సామాజికవర్గం నాయకుల్లో బలమైన నేతగా ఉన్న సామినేని ఉదయభాను మున్ముందు తన రాజకీయ వేదికగా విజయవాడను ఎంపిక చేసుకోనున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అందులో భాగంగానే వీఎంసీకి చెందిన నలుగురు వైసీపీ కార్పొరేటర్లను కూడా తనతో పాటు జనసేనలోకి తీసుకెళ్లేందుకు ఆయన పావులు కదిపారు. ఉదయభానుకు ఎన్టీఆర్ జిల్లా జనసేన బాధ్యతలు అప్పగించి, విజయవాడ కేంద్రంగా పనిచేయాలని జనసేన నాయకులు సూచిస్తున్నట్లు సమాచారం. జగ్గయ్యపేటలో టీడీపీకి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో పాటు బలమైన నాయకులు ఉన్నందున అక్కడ మరో అధికార కేంద్రం ఉండకూడదన్న ఉద్దేశంతో జనసేన అధిష్ఠానం ఈ సూచన చేసినట్లు సమాచారం. దీనికి ఆయన కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

త్వరలో మరో మాజీ ఎమ్మెల్యే కూడా..

విజయవాడకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే త్వరలో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నట్లు తెలుస్తోంది. ఆయన ఎన్నికలకు ముందే వైసీపీని వీడి బీజేపీలో చేరేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. అప్పట్లో సీట్ల సర్దుబాటులో ఒత్తిడి కారణంగా హామీ రాకపోవడంతో ఆయన చేరిక వెనక్కి వెళ్లింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన తిరిగి బీజేపీ పంచన చేరేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఆ పార్టీలో పనిచేసిన అనుభవం ఉండటంతో ఆ పార్టీ పెద్దలతో టచ్‌లో ఉంటూ వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

రూ.1.50 కోట్లు నొక్కేశారు

గుడివాడ మున్సిపాల్టీలో 'డీజిల్' దోపిడీ

అవినీతిలో వైసీపీ నాయకులకు ఏమాత్రం తీసిపోమని నిరూపించారు గుడివాడ మునిసిపల్ అధికారులు. మునిసిపల్ కార్యాలయంలోని జనరేటర్‌కు డీజిల్ పేరుతో ఏకంగా సుమారు రూ. 1.50 కోట్లు దోచేశారు. ఇందులో డీఈ స్థాయి అధికారే కీలక సూత్రధారిగా వ్యవహరించారు. మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు శశి సహకారంతో పురపాలక సంఘ కార్యాలయంలో అన్ని శాఖలను ఇప్పటికే కొల్లగొట్టి జేబులు నింపుకున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. -గుడివాడ


భారీగా డీజిల్ బిల్లులు పెట్టుకున్న పురపాలక సంఘానికి చెందిన జనరేటర్ ఇదే

- డీఈ స్థాయి అధికారి నిర్వాకం
- నాని ముఖ్య అనుచరుడు శశి సహకారంతోనే..
- అవినీతిలో వైసీపీ నేతలకు ధీటుగా మునిసిపల్ అధికారులు

ఐదేళ్లలో డీజిల్ పేరుతో చేతివాటం

గత వైసీపీ పాలనలో డీజిల్ పేరుతో దోపిడీకి తెరలేపారు. గుడివాడ పురపాలక సంఘానికి లేటెస్ట్ టెక్నాలజీ గల కిర్లోస్కర్ కంపెనీకి చెందిన కొయిల్ గ్రీన్ జనరేటర్ కలదు. విద్యుత్ కోతలప్పుడు మాత్రమే సదరు జనరేటర్‌ను వినియోగిస్తారు. సాధారణంగా వినియోగిస్తే గంటకు ఒక లీటరు డీజిల్ వాడకం అవుతుందని, అదే కార్యాలయంలోని ఏసీలను వినియోగిస్తే గంటకు 10 నుంచి 12 లీటర్ల డీజిల్ వాడకం జరిగే అవకాశం ఉందని ఎలక్ట్రీషియన్‌లు తెలుపుతున్నారు. ఈ లెక్కన నెలకు రూ.8వేల నుంచి రూ.11 వేల వరకు మాత్రమే డీజిల్‌కు ఖర్చు అవుతుంది. నెలకు రూ.25 వేల నుంచి రూ.35వేల వరకు డీజిల్ బిల్లులను పెట్టి మున్సిపల్ సొమ్మును నొక్కేశారు.

రోజుకు 10 గంటలు వాడారా..?

ఐదేళ్ల కాలంలో పెద్దగా విద్యుత్ కోతలు కూడా లేవు. ఉన్నా గంటల తరబడి అయితే కాదు. పోని విద్యుత్ బిల్లులను చెల్లించలేదన్న సాకుతో విద్యుత్ శాఖ అధికారులు పురపాలక సంఘానికి చెందిన విద్యుత్ కనెక్షన్‌లను కట్ చేసిన దాఖలాలు కూడా లేవు. అయినా కూడా రోజుకు జనరేటర్ 10 నుంచి 12 గంటలు వినియోగించారంటే ఆశ్చర్యం కలిగించకమానదు. రోజుకు 10లీటర్ల చొప్పున నెలకు 300 నుంచి 400 లీటర్ల వరకు డీజిల్ బిల్లులను పెట్టినట్టు సమాచారం. వైసీపీ పాలనలో ఒక్క నెలలో 800 లీటర్లు వాడినట్టు బిల్లును చేసుకున్నారని కార్యాలయ వర్గాలు బాహాటంగానే పేర్కొంటున్నాయి.

నెలకు రూ.36 వేలు డీజిల్ బిల్లా..?

గత వైసీపీ పాలనలో సాగించిన దోపిడీనే కొనసాగిస్తూ ఎన్నికల వేళ ఎవరు పట్టించుకోరనే ధీమాతో డీఈ స్థాయి అధికారి ఏకంగా నెలకు - మిగతా 6లో

బుడమేరు ప్రక్షాళనకు మూడు ఆప్షన్లు

'ప్రకృతి విపత్తులన్నీ విజయవాడపై పగబట్టి ఒక్కసారిగా దాడి చేశాయి. బుడమేరు వరద ఊహించరానిది. గండ్లు పడటం వల్లే ఇంత విలయం జరిగింది. బుడమేరు ప్రక్షాళనకు మూడు ఆప్షన్లు పరిశీలిస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అత్యుత్తమమైనది ఎంపిక చేస్తా. వరదల్లో తొలి రెండు రోజులు ఏం చేయలేకపోయాం. సీఎం ప్రత్యక్ష పరిశీలన ద్వారా చురుగ్గా పనిచేసి, త్వరగా విలయం నుంచి బయటపడ్డాం. ఏ ఒక్క వరద బాధితుడు కూడా నష్టపోకూడదన్న ఉద్దేశంతో ఎన్యూమరేషన్‌ను పక్కాగా నిర్వహించాం. ఇన్సూరెన్స్ క్లెయిమ్స్, బ్యాంకు రుణాలకు సంబంధించి పురోగతి సాధించాం.' అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ గుమ్మళ్ల సృజన పేర్కొన్నారు. కృష్ణా, బుడమేరు వరద సృష్టించిన బీభత్సం తర్వాత మొదటిసారిగా ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు.. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



ఆంధ్రజ్యోతి : వరద ప్రమాదంపై ముందుగా ఎందుకు హెచ్చరించలేకపోయారు?

సృజన : నగరానికి అన్ని విపత్తులూ పగబట్టినట్టు ఒకేసారి వచ్చాయి. భారీ వర్షాలకు ముందుగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ తర్వాత కృష్ణానదికి రికార్డు స్థాయిలో 11.50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. బుడమేరుకు కూడా 60 ఏళ్ల చరిత్రలో రికార్డు స్థాయిలో వరద పోటెత్తింది. బుడమేరుకు - మిగతా 6లో

ప్రకృతి ఒకేసారి బెజవాడపై పగబట్టింది

- 60ఏళ్లలో రికార్డుస్థాయిలో బుడమేరుకు వరద
- గండ్లు పడటం వల్లే ఇంతటి విలయం
- తొలి రెండు రోజులు ఏం చేయలేకపోయాం
- సీఎం ప్రత్యక్ష పరిశీలనతో త్వరగా బయటపడ్డాం
- పక్కాగా ఫ్లడ్ ఎన్యూమరేషన్, రీ వెరిఫికేషన్
- ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా క్లెయింల పరిష్కారం
- బాధితులకు బాసటగా కొత్త రుణాలు, రీ షెడ్యూల్

'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



పునాదిపాడులో రైతులు, అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

ధాన్యం విక్రయించిన 48 గంటల్లో

రైతు ఖాతాలో నగదు జమ

» పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

కంకిపాడు, సెప్టెంబరు 21: "రైతులు, కౌలురైతులకు న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే బిల్లులు వారి ఖాతాల్లో జమ చేస్తాం." అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని పునాదిపాడు రైతుసేవా కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులను అధిగమిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు నిబంధనలపై వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, ట్రాన్స్‌పోర్టు సౌకర్యాన్ని కల్పించాలని ఆయన సూచించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిప్యూటీ కలెక్టర్ టి.వి.సతీష్, తహసీల్దార్ భావన్నారాయణ, ఏవో పి.ఎం.కిరణ్, రైతులు మద్దాలి సాయిబాబు, కనగాల సుబ్బారావు, శ్రీనివాసరావు, సంజీవరావు పాల్గొన్నారు.

ఏడాదైనా ధాన్యం బిల్లులు జమచేయలేదు

» ఉప్పలూరు పీఏసీఎస్ నిర్వాకంపై మంత్రికి ఫిర్యాదు

ధాన్యం విక్రయ బిల్లులను రైతు ఖాతాల్లో జమ చేయకుండా ఉప్పలూరు పీఏసీఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్‌కు గ్రామానికి చెందిన రైతు కనగాల సుబ్బారావు ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన ధాన్యానికి బిల్లులు రూ.10 లక్షలు ఉప్పలూరు సొసైటీలో జమయ్యాయని, ఇప్పటికీ సొసైటీ అధికారులకు తమ ఖాతాల్లో నగదు జమ చేయడం లేదని, సొసైటీ అధికారులను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని మంత్రికి తెలిపారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని జేసీ గీతాంజలిశర్మను మంత్రి ఆదేశించారు.



50వ డివిజన్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఏడాదిన్నరలో బందరు పోర్టు పూర్తిచేస్తాం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 21: "ఏడాదిన్నరలో బందరు పోర్టు పూర్తి చేస్తాం. బందరులో పెట్రోలియం రిఫైనరీ ఏర్పాటు చేస్తాం. దీపావళి నాడు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి శ్రీకారం చుడతాం. జిల్లాలో వరదల వంటి ఎన్ని ఇబ్బందులొచ్చినా ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం." అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మచిలీపట్నం 27 వడివిజన్ ఖోజిల్లిపేట, 50వ డివిజన్ సుందరయ్యనగర్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మచిలీపట్నం రోడ్ల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. టిడ్కో ఇళ్లను పూర్తిచేసి పేదలకు ఇస్తామన్నారు. గత పాలకులు తిరుమల శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు నుంచి తీసిన నూనెను కలిపి ప్రసాదాన్ని అపవిత్రం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల మంజూరులో పేదల వద్ద లంచాలు గుంజారన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రానికి ఆదాయం లేదని, పెట్టుబడులు లేవని, రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామికవేత్తలను తరిమికొట్టి పైశాచిక ఆనందం పొందారని ఆరోపించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు మోటమర్రి బాబాప్రసాద్, ఎండీ ఇలియాస్‌బాషా, పిప్పళ్ల కాంతారావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

నా కొడుకు ప్రాణాన్ని కాపాడండి

» కొల్లు రవీంద్రకు కిడ్నీ బాధితుడి తల్లి మొర

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చికిత్సకు నగదు ఇప్పించి తన కొడుకు ప్రాణాన్ని కాపాడమని మంత్రి కొల్లు రవీంద్రకు కిడ్నీ బాధితుడి తల్లి మొరపెట్టుకుంది. శనివారం బైపాస్‌రోడ్డులోని 50వడివిజన్‌లో రెండు కిడ్నీలు పాడైపోయి పూర్తిగా నీరసించిన దొడ్డాకుల శ్యాం సంతోష్‌ను మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. శ్యాం సంతోష్ బాలాజీ విద్యాలయంలో ఏడో తరగతి చదువుతున్నాడు. తండ్రి వరప్రసాద్, తల్లి నాగగాయత్రి తమ కుమారుని దుస్థితిని మంత్రికి వివరించారు. రూ.లక్షలు గుమ్మరిస్తే కాని ఆపరేషన్ చేయబోమంటున్నారని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు.

వరద బాధితులకు

రూ.157.85 కోట్ల బ్యాంకింగ్ సేవలు

» మూడు రోజుల్లో రూ.148.22 కోట్ల రుణాల రీషెడ్యూల్.. రూ.9.62 కోట్లు మంజూరు: కలెక్టర్ సృజన

వన్‌టౌన్, సెప్టెంబరు 21: "వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నాం. రుణాల కోసం వారు పెట్టుకున్న దరఖాస్తుల్లో 2,740 ఖాతాలవి పరిష్కరించి మూడు రోజుల్లో రూ.157.85 కోట్ల విలువైన బ్యాంకింగ్ సేవలందించాం. 1,900 ఖాతాలకు రూ.148.22 కోట్ల రుణాలను రీషెడ్యూల్, 840 ఖాతాలకు కొత్తగా రూ.9.62 కోట్ల రుణాలను మంజూరు చేయించాం." అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో 310 ఖాతాలకు రూ.77.50 లక్షల వినియోగ రుణాలు ఉన్నాయని, శనివారం ఒక్కరోజే 450 ఖాతాలకు రూ.28.96 కోట్ల మేరకు రుణాలను రీషెడ్యూల్ చేసినట్లు ఆమె తెలిపారు. కొత్తగా 315 ఖాతాలకు రూ.1.83 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో 190 ఖాతాలకు రూ.47 లక్షల మేర వినియోగ రుణాలు ఉన్నాయని తెలిపారు. బ్యాంక్‌ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, పెయింటర్, ఏసీ మెకానిక్ సేవల కోసం 5,149 రిక్వెస్టులు నమోదయ్యాయని, 4,922 పరిష్కరించామని తెలిపారు.



కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం సమర్పిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి..రాము తదితరులు

బదిలీలు పారదర్శకంగా చేయాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 21: ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాము కోరారు. శనివారం కలెక్టర్‌ను సంఘ నాయకులతో పాటు ఆయన కలిశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ రూపొందించిన రాష్ట్ర, జిల్లాస్థాయి కార్యవర్గ జాబితాల బుక్‌లెట్‌ను కలెక్టర్‌కు అందించారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, సాయిరాంనాయక్, పవన్‌కుమార్, ఎన్వీ రామారావు, వీరబాబు, బ్రహ్మానందబాబు, పరమేశ్వరరావు, భాస్కర్, సలీం, సముద్రేశ్వరరావు, లోకేష్, రవికుమార్, శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

లంక భూముల్లో ఇసుక మేటలు

కృష్ణానది, మునేరు సంగమ ప్రాంతంలో లంకభూముల్లో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు ఇటీవల వచ్చిన వరదల దెబ్బకు కుళ్లిపోయాయి. అది చాలదన్నట్టు వరద లంక భూముల్లోకి భారీగా ఇసుకను మోసుకొచ్చింది. వంద ఎకరాలకు పైగా విలువైన పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. ఇసుకను తొలగించడం రైతులకు పెనుభారంగా మారింది. ఇసుక తొలగింపునకు రూ.లక్షలు ఖర్చు కానుండటంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ప్రభుత్వసాయం కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.





ఇసుక దిబ్బలుగా మారిన మున్నలూరు లంక భూములు

రైతులకు పెనుభారంగా తొలగింపు ● ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు



కంచికచర్ల: కంచికచర్ల మండలం మున్నలూరు, మోగులూరు, చందర్లపాడు మండలం ఏటూరు గ్రామాలకు చెందిన రైతులకు కృష్ణానది, మునేరు సంగమ ప్రాంతంలో మూడు వందల ఎకరాలకు పైగా లంక భూములున్నాయి. కంద, చామ, అరటి తోటలతో పాటుగా పత్తి, మిర్చి, మినుము పంటలు సాగు చేశారు. ఓవైపు కృష్ణానది, మరోవైపు మునేరు వరద దెబ్బకు తోటలు, పంటలు దెబ్బతిన్నాయి. నాలుగైదు రోజులు వరద ముంపు ఉండటం వల్ల తోటలు, పంటలు పూర్తిగా కుళ్లిపోయాయి. పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. వంద ఎకరాలు ఇసుక దిబ్బలుగా మారాయి. పంట భూముల్లో రెండు అడుగుల ఎత్తున ఇసుక మేటవేసింది. ఇసుక మేటలు తొల గించి, బాగు చేశాకే తోటలు, పంటల సాగు సాధ్యమవుతుంది. ఇసుక తొలగింపు చాలా ఖర్చుతో కూడుకుంది. ఇసుకను ఎవరైనా తీసుకెళ్లినా ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు అవుతుందని, ఎవరూ తీసుకెళ్లపోతే ఇసుకను బయటకు తరలించేందుకు లక్షల్లో ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. వరద పూర్తిగా తగ్గిపోయి పక్షం రోజులైనా ఒక్క రైతు కూడా ఇసుక మేట తొలగించలేదు. లక్షల్లో పెట్టుబడి నష్టపోయిన రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. లంక భూముల్లో 150 వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. స్టార్టర్లు పనికిరాకుండా పోయాయి. మోటారు ఆయిలింగ్ చేసి, కొత్త స్టార్టర్లు, ఇతరత్రా ఉపకరణాల కొనుగోలుకు రూ.ఐదువేల వరకు అవుతోందని అంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మునేటి వరదకు తోటలు, పంటలతో పాటుగా సారవంతమైన లంక భూములు దెబ్బతిన్నాయి. భారీగా వేసిన ఇసుక మేటలు తొలగింపు ఒకటి రెండు రోజుల్లో అయ్యే పనికాదు. రూ.లక్షల్లో ఖర్చవుతుంది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

\- చిరుమామిళ్ల రామారావు, రైతు



మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్

కొత్త చట్టాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

» ఐలు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్

గన్నవరం, సెప్టెంబరు 21: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆలిండియా లాయర్స్ యూనియన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం ఆట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాల్‌లో ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్రం తెచ్చిన కొత్త చట్టాలు-ప్రజల హక్కులపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గత క్రిమినల్ చట్టాలను రద్దు చేసి నూతన చట్టాలను ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి తెచ్చిందన్నారు. కొత్త చట్టాల్లో కొత్తదనం ఏమీ లేదని, నాటి వలస పాలకుల బానిస మనస్తత్వానికి తోడు మరిన్ని దారుణ మైన, ప్రజలకు వ్యతిరేకమైన అంశాలు వీటిలో ఉన్నాయని తెలిపారు. 90శాతం వరకూ పాత చట్టాలను మక్కీకిమక్కీగా దించేశారన్నారు. 10 శాతం మార్పులు.. వలస పాలకుల చట్టాలు కంటే అధ్వానంగా, మన రాజ్యాంగం, సుప్రీం కోర్టు గుర్తించిన ప్రజాహక్కులను కాలరాసేలా ఉన్నాయని తెలిపారు. ఉద్యమంలో న్యాయవాదులు ప్రజలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సంపర శ్రీనివాసరావు, సుధాకర్, రాజారత్నం, అనుమోలు వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, వేము కోటేశ్వరరావు పాల్గొన్నారు. కొత్త భవనాలు నిర్మించాలని, న్యాయవాదుల సమస్యలు తీర్చాలని తీర్మానం చేశారు.

ఆంజనేయులు తప్పుడు వార్తలు రాయిస్తున్నారు

» ఆయన అక్రమాలు చంద్రబాబు దృష్టికి తీసుకెళతా

» ఐదేళ్లుగా వైసీపీ వారితో అంటకాగుతున్నారు: గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పటమట/చిట్టినగర్, సెప్టెంబరు 21: "విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు నాపై తప్పుడు వార్తలు రాయిస్తున్నారు. రాజకీయాల్లోకి రాకముందు ఆంజనేయులు పరిస్థితి ఏంటి?. ఎన్నికలకు ముందు వైసీపీతో చలసాని అంటకాగారు. ఆయన అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తే వాస్తవాలు బయటకు వస్తాయి." అని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఆంజనేయులకు చైర్మన్ పదవి చంద్రబాబు పెట్టిన భిక్ష. చంద్రబాబు అపాయింట్‌మెంట్ అడుగుతా.. చలసాని అక్రమాలు, అవినీతిని వైసీపీతో అంటకాగుతున్న విధానాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళతా. వైసీపీతో అంటకాగకపోతే వైసీపీ ప్రభుత్వంలో చలసాని డెయిరీ చైర్మన్‌గా ఎలా కొనసాగారు. రాష్ట్రం కోసం చంద్రబాబు47 ఏళ్ల చాకిరీ చేశారు. ఆయనను అరెస్టు చేస్తే లక్షలాది మంది రోడ్డు మీదకు వచ్చి ర్యాలీలు చేశారు. ఆ రోజు చలసాని ఎక్కడకి వెళ్లిపోయారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయవాడలో అత్యధిక శాతం పాలబూత్‌లు వైసీపీ వారికి కేటాయించింది.. నిజం కాదా?" అని వెంకట్రావు ప్రశ్నించారు. తన విజయాన్ని కాంక్షిస్తూ పవన్ కల్యాణ్ కూడా నియోజకవర్గానికి వచ్చారని, కూతవేటు దూరంలో ఉన్న వ్యక్తి ఆంజనేయులు రాలేకపోయారని అన్నారు. తాను 13 మాసాలు కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా పనిచేశానని, రూ.5వేల కోట్ల టర్నోవర్ ఉన్న బ్యాంక్ టర్నోవర్‌ను రూ.8500 కోట్లకుపైగా తీసుకెళ్లానని వెంకట్రావు తెలిపారు. అయినా అప్పటి వైసీపీ నీచ ప్రభుత్వం పదవి నుంచి తనను తొలగించిందన్నారు. తాను కేడీసీసీ బ్యాంకు అధికారిపై దాడి చేశానని అవాస్తవాలు రాశారన్నారు. రామవరప్పాడు సర్పంచ్ శ్రీదేవి గతంలో వైసీపీలో ఉండి తనను ఇబ్బంది పెట్టిందన్నారు. ఆమెను గద్దె అనురాధ కలవడం తనకు సమంజసమనిపించలేదని, ఈ విషయమై వారిని అడిగినమాట వాస్తవమేనన్నారు. గన్నవరం పరిధిలోని సీఐ, ఏసీపీలను తన ప్రమేయం లేకుండా గద్దె రామ్మోహన్ ఏకపక్షంగా పోస్టింగ్‌లు ఇప్పించారని, పార్టీలో ఆయన సీనియర్ నాయకుడని తానేమీ మాట్లాడలేదన్నారు. కృష్ణాజిల్లాలో జగన్ పాదయాత్ర సమయంలో తాను అందరికీ అన్నం పెడితే, జగన్ తనకు సున్నం పెట్టాడన్నారు. తనతో వందల కోట్లు ఖర్చు చేయించిన వైసీపీ, కొడాలి నాని, వల్లభనేని వంశీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని, ప్రశ్నించారు. తనను మోసం చేసింది జగన్ అని, వైసీపీలో పనిచేసినందుకు సిగ్గుగా ఉందని వెంకట్రావు పేర్కొన్నారు.

32 ఏళ్లుగా పార్టీ కోసమే పనిచేస్తున్నా

» ఇప్పటికీ టీడీపీనే ప్రాణం

» మిల్క్ యూనియన్‌లో రాజకీయాలు ఉండకూడదనేదే లక్ష్యం

» ఇందులో అన్ని పార్టీల వారున్నారు: విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు



మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు, పక్కన డైరెక్టర్లు

"కృష్ణా మిల్క్‌యూనియన్‌ను రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నాం. పాలు పోసేవాళ్లు, సేకరించేవాళ్లు ఏ పార్టీ అనేది చూడం. పాడిరైతుకు ఎంతమేలు జరిగిందన్నదే ఆలోచిస్తాం. నేను పార్టీ ఆవిర్భావం నుంచి 32 ఏళ్లుగా టీడీపీ కోసం ప్రాణం పెట్టి పనిచేస్తున్నా. చంద్రబాబు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకుని ఈ స్థాయికొచ్చా. నేను ఎవరిపైనా తప్పుడు వార్తలు రాయించలేదు. ఆ అవసరం నాకు లేదు. మిల్క్‌యూనియన్ చైర్మన్‌గా నిర్వహించాల్సిన బాధ్యతలు చాలా ఉన్నాయి." అని కృష్ణా మిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేసిన వ్యాఖ్యలపై శనివారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాల రైతుల్లో అన్ని పార్టీల వారున్నారని, ఇది మిల్క్ యూనియన్ కుటుంబమని, ఇక్కడ రాజకీయాలు చేస్తే ఇన్నేళ్లు యూనియన్ బతికేది కాదని స్పష్టంచేశారు. "వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయంలోనే నేను యూనియన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించా. ఐదేళ్లుగా ఏ తప్పు చేయలేదు. మా దగ్గర లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయి. అందుకే వైసీపీ వాళ్లు ఏమీ చేయలేకపోయారు. వంద షాపులు వైసీపీ వాళ్లకు ఇచ్చారనడం హాస్యాస్పదం. బీఎస్ఎన్ఎల్ పాయింట్లను లీజుకు తీసుకుని టెండర్లు పిలిచాం. అందులో అన్ని పార్టీల వాళ్లు, పార్టీలకు సంబంధం లేనివారు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమూల్‌ను ప్రోత్సహించింది. మాకు సహకారం అందించలేదు. పాడిరైతుల సహకారంతో నిలబడ్డాం. రాజకీయాలకు అతీతంగా యూనియన్‌ను నిర్వహించడం వల్లే ఇది సాధ్యమైంది. నాపైనా బ్లూమీడియాలో అనేక కథనాలొచ్చాయి. కొన్నింటిపై కోర్టుకు వెళ్లాం. ఇప్పటికీ వ్యక్తిగతంగా పార్టీ కోసం పనిచేస్తున్నా. పార్టీ ఏ పని అప్పగిస్తే అది తూచా తప్పకుండా చేశా. ఎవ్వరిపైనా కుట్రలు చేయలేదు." అని చలసాని పేర్కొన్నారు. "ఇక్కడ రాజకీయపార్టీలు చూస్తే యూనియన్ బతకదు. ఉమ్మడి కృష్ణాలోని 16మంది ఎమ్మెల్యేల్లో ఒక్క ఎమ్మెల్యేకే యూనియన్ పనితీరుపై అభ్యంతరముంటే తప్పెక్కడుందో ఆలోచించాలి. మాది నామినేటెడ్ బాడీకాదు, పత్రికల్లో వచ్చే కథనాలు, రాజకీయాలను యూనియన్‌కు ఆపాదించొద్దు." అని యూనియన్ డైరెక్టర్ సాయివెంకటరమణ కోరారు.

మల్లవల్లి పారిశ్రామికవాడ భూమికి సరిహద్దులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 21: మల్లవల్లి పారిశ్రామికవాడకు చెందిన భూమికి అధికారులు శనివారం హద్దులు నిర్ణయిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ పర్యవేక్షణలో పారిశ్రామికవాడకు చెందిన 1,460 ఎకరాల భూమిని విడగొట్టి సరిహద్దులు నిర్ణయించి ఏపీఐఐసీకి అప్పగించేందుకు శనివారం పనులు మొదలు పెట్టినట్లు ఆర్డీవో పద్మావతి, జిల్లా ఏడీ (సర్వే) మనీషాత్రిపాఠి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారాం తెలిపారు. 20మంది వీఆర్వోలు, 38మంది సర్వే సిబ్బందితో 12 బృందాలుగా ప్రభుత్వం వద్ద గల ఆధారాల ప్రకారం సరిహద్దులు నిర్ణయించేందుకు పనులు మొదలయ్యాయి. 200 ఎకరాల భూమి సరిహద్దు వివాదాస్పదంగా మారటంతో రెవెన్యూ, ఏపీఐఐసీ సంయుక్తంగా హద్దులు నిర్ణయిస్తోందని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారాం తెలిపారు. మల్లవల్లి పారిశ్రామికవాడ భూమి 1460 ఎకరాల్లో 100 ఎకరాలు పేదలకు ఇచ్చేలా గత ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారని, ఆ భూమితో సహా ప్రభుత్వ భూమికి సరిహద్దులు నిర్ణయించి ఏపీఐఐసీకి అప్పగించేందుకు పనులు చేయిస్తున్నామని ఆర్డీవో పద్మావతి వివరించారు. బాపులపాడు తహసీల్దార్ నాగభూషణం, ఏపీఐఐసీ సిబ్బంది సర్వే పనుల్లో పాల్గొన్నారు. రైతులనుంచి ఇబ్బందులు రాకుండా 256మంది పోలీసులతో సీఐ సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాసు, జనార్దన్ పర్యవేక్షించారు.



సరిహద్దులు నిర్ణయిస్తున్న అధికారులు

ప్రభుత్వానికి సహకరిస్తాం: నిర్వాసిత రైతులు

మల్లవల్లి పారిశ్రామికవాడకు సాగుభూములిచ్చిన రైతులు ప్రభుత్వానికి సహకరించేందుకు ముందుకొచ్చారు. సరిహద్దులు తేలితేనే తమ భూములెక్కడ ఉన్నాయో తెలుస్తుందని అందుకే ప్రభుత్వానికి, ఏపీఐఐసీకి పూర్తిగా సహకారమందిస్తామని పంతం కామరాజు, అనిల్‌కుమార్ తదితరులు తెలిపారు. పారిశ్రామికవాడలో తమ భూములున్నట్లు తేలితే తమకు నష్టపరిహారం వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చిన మేరకు అధికారులకు సహకరిస్తున్నామని తెలిపారు.

రూ.1.50 కోట్లు నొక్కేశారు

(ఐదో పేజీ తరువాయి)

రూ.36వేలు డీజిల్ బిల్లు పెట్టి సొమ్ము చేసుకున్నాడు. సదరు ఫైల్‌ను చూసిన మున్సిపల్ కమిషనర్ ఆశ్చర్యపోయారు. ఎన్నికల విధులకు వచ్చిన కమిషనర్ ఏమి పట్టించుకోరనే ఈ సాహసానికి ఒడిగట్టినట్లు సమాచారం. అయితే సదరు కమిషనర్ దీనిపై క్లాసు పీకినట్లు సమాచారం. దీంతో సదరు మొత్తాన్ని ఆ అధికారి తిరిగి మున్సిపల్ ఖాతాకు జమ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. తెలిసి ఒక్కనెలకే రూ.36వేలు బిల్లు చేసుకున్నారంటే ఐదేళ్లలో ఏ మేరకు మున్సిపల్ సొమ్మును నొక్కేసారో తేలాల్సి ఉంది.

తెలివిగా పక్కదారి పట్టించారు..

మున్సిపల్ డీజిల్ టోకెన్‌లను సొమ్ముగా మార్చకుంటే దొరికిపోతామనే ఆలోచనతో టోకెన్‌ల ద్వారా సొంత వాహనానికి డీజిల్‌ను మళ్లించినట్లు సమాచారం. ముఖ్యంగా డీఈ స్థాయి అధికారి గత ఐదేళ్లలో సొంత సొమ్ముతో తన సొంత వాహనానికి ఏ ఒక్కరోజు కూడా ఆయిల్ కొట్టించలేదని మున్సిపల్ వర్గాల్లో వినికిడి. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడికి బదిలీపై వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ సైతం తన సొంత వాహనానికి మున్సిపల్ టోకెన్‌లను వినియోగించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వీరందరూ నాని ముఖ్య అనుచరుడికి సంబంధించిన పెట్రోల్ బంకులో మునిసిపల్ ఆయిల్ టోకెన్‌లను వినియోగించినట్లు సమాచారం.

ఐదేళ్లలో ఎంత దోచేసారో..!

మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు శశి సహకారంతో ఆయన దూరపు బంధువు అనాటి మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ కొందరు డీఈ, ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కొందరు ఒక ముఠాగా ఏర్పడి ఇలాంటి కుంభకోణాలకు పాల్పడినట్లు కార్యాలయవర్గాల్లో వినికిడి. గత దశాబ్దకాలంగా మున్సిపాల్టీని వదలకుండా ఇక్కడే తిష్ట వేసుకుని కూర్చున్న డీఈ ఈ దోపిడీలో ప్రధాన పాత్ర పోషించినట్లు సమాచారం. ఎన్నికలకు ముందు ఒక్క నెలకే రూ.36వేలు జనరేటర్ డీజిల్ బిల్లు పెట్టారంటే ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ మేరకు దోపిడీ జరిగి ఉంటుందోనని పలువురు పేర్కొంటున్నారు. గత ఐదేళ్ల కాలంలో సుమారు రూ.1.50కోట్లు మేర మున్సిపాల్టీ సొమ్మును బొక్కేసారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలి

జనరేటర్ డీజిల్ వాడకం పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం పలు అనుమానాలకు ఆస్కారమిస్తోంది. వెంటనే డిపార్ట్‌మెంట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రాజమండ్రి మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నిజనిజాలను నిగ్గు తేల్చాలి.

\- టీడీపీ నాయకులు

బుడమేరు ప్రక్షాళనకు మూడు ఆప్షన్లు

(ఐదో పేజీ తరువాయి)

ఎంత వరద వస్తుందన్నది అంచనా వేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని అధికారులు నా దృష్టికి తీసుకొచ్చారు. నేను కవులూరు, వెల్లటూరు, వెలగలేరు, శాంతినగర్ వంటి ప్రాంతాలకు ఏర్పడే ప్రమాదంపై దృష్టి సారించాను. కట్టలు బలహీనంగా ఉండటం వల్ల గండ్లు పడిన విషయం ముందుగా తెలియలేదు. గండ్లు పడటం వల్లే ఇంత విపత్తు జరిగింది. వేలాది క్యూసెక్కుల వరద దిశ మార్చుకుని విలయం సృష్టించింది. తొలి రెండు రోజులు మేము ఏం చేయలేకపోయామన్న బాధ ఉంది. ఎందుకంటే పనిచేయాల్సిన వారే వరదలో చిక్కుకున్నారు. ఏం చేయాలో పాలుపోలేదు. ఆ సమయంలో ఒక్కటే అనుకున్నాను. నేను నిలబడకపోతే వ్యవస్థ పనిచేయదు. విశ్రాంతి తీసుకుంటే దిద్దుబాటు చర్యలు ఎవరు తీసుకుంటారని భావించాను. కుటుంబానికి కూడా దూరంగా ఉంటూ అహోరాత్రాలు పనిచేశాం. అధికారులు కొందరు హాస్పిటల్‌లో వైద్యం చేయించుకుని, సెలైన్లు పెట్టించుకుని వచ్చి పనిచేశారు. సీఎం చంద్రబాబు వచ్చాక ఐఎండీ తదితర నాలుగు ఏజెన్సీలతో అంచనా వేయిస్తే కానీ, ఎంత భారీ వరద వచ్చిందో తెలియలేదు. తెలిసిన తర్వాత అతి తక్కువ వ్యవధిలో చర్యలు చేపట్టడం చాలా కష్టం. మొత్తం మీద చివరకు సమస్య నుంచి బయటపడ్డాం.

ఆంధ్రజ్యోతి: సీఎం చంద్రబాబు ప్రత్యక్ష పరిశీలనపై మీరేమంటారు?

సృజన: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇక్కడ ఉండటం మా అదృష్టం. మొదట్లో ఆయన నాపై కోప్పడ్డారు. ఆయన రావటం వల్ల రాష్ట్ర యంత్రాంగమంతా కదిలింది. రాష్ట్రం నలుమూలల నుంచి ఆయన 300 బోట్లు తెప్పించారు. నేను ఒక్కదానినే అన్ని బోట్లు సమకూర్చలేను. రోజూ ఉదయం, రాత్రి సమీక్షలు చేసేవారు. వీటివల్ల వేగంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు అమలయ్యేవి. ఆయన రోజూ క్షేత్రస్థాయి పర్యటనలు చేయటం వల్ల ఏం చేయాలో ఓ అవగాహన వచ్చేది. తక్కువ సమయంలో గండ్లను పూడ్చగలగటం సీఎం ఘనతే. చివర్లో ఆయన వెళ్లేటపుడు.. 'గట్టిగా నిలబడ్డావమ్మా..'అనడం నాకెంతో ధైర్యన్నిచ్చింది.

ఆంధ్రజ్యోతి:: బుడమేరు ఆక్రమణలకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సృజన: బుడమేరు ఆక్రమణలకు సంబంధించి సమగ్ర డేటా తీస్తున్నాం. 1956 నుంచి బుడమేరు వివిధ దశల్లో ఎలా ఉందన్న డేటా తెప్పించాం. అన్ని సందర్భాల్లోనూ 20 నుంచి 120 మీటర్ల మేర ఉంది. బుడమేరు పరివాహక ప్రాంతం మొత్తం 2,930 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. విజయవాడ నగరం వెలుపల 240 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయి. ఇవన్నీ పొలాలే కాబట్టి పెద్దగా సమస్య లేదు. విజయవాడలో 80 ఎకరాల విస్తీర్ణంలో 4వేలకు పైగా ఆక్రమణలు ఉన్నాయి. చాలావరకు కాలనీలుగా ఉన్నాయి. అపార్ట్‌మెంట్లు కూడా ఉన్నాయి. బుడమేరు శాశ్వత పరిష్కారానికి ఏం చేయాలన్న దానిపై మూడు ఆప్షన్లు మా ముందున్నాయి. ఆక్రమణల తొలగింపు ఒకటైతే, రిటైనింగ్ వాల్ నిర్మించటం, పాముల కాల్వ నుంచి బుడమేరుకు సమాంతరంగా మరో ప్రత్యామ్నాయ కాల్వను ఆధునికీకరించడం మా ముందున్న రెండు, మూడు ఆప్షన్లు. వీటిపై ముఖ్యమంత్రితో చర్చించాక ఆయన ఇచ్చే మార్గదర్శకాల ప్రకారం ముందుకెళ్తాం.

ఆంధ్రజ్యోతి: ఫ్లడ్ ఎన్యూమరేషన్ ఎంతవరకు వచ్చింది?

సృజన: ఒక్క వరద బాధితుడు కూడా నష్టపోకూడదని ముఖ్యమంత్రి చెప్పిన ఆదేశాల మేరకు ఫ్లడ్ ఎన్యూమరేషన్ జరిగింది. మొత్తం 2,32,000 ఇళ్లకు ఎన్యూమరేషన్ జరిగింది. దెబ్బతిన్న ఇళ్లు 50వేల వరకు ఉంటాయని భావించాం. ఎవరూ నష్టపోకూడదన్న ఉద్దేశంతో రీ వెరిఫికేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాం. 75వేల నుంచి 80వేల వరకు ఇళ్లు డ్యామేజీ అయ్యాయని గుర్తించాం. పలువురు బాధితులు సర్వే జరగలేదని ఫోన్లు చేస్తున్నారు. అటువంటి వాటిని కూడా తహసీల్దార్లతో వెరిఫికేషన్ చేయిస్తున్నాం. సర్వే పరిధిలోకి రాని వారి వివరాలను ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. నిజమైన బాధితులు ఎవరున్నా పరిగణనలోకి తీసుకుంటాం. గ్రీవెన్స్ ద్వారా కూడా తెలుసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా సేవలు ఎంతవరకు అందించారు?

సృజన: ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఇన్సూరెన్స్ ఫెసిలిటేషన్ ఏర్పాటు చేశాం. ఆయన ఆదేశాల మేరకు వాహనాలు, వ్యాపారాలు, దుకాణాలు, చిన్న పరిశ్రమలకు జరిగిన నష్టాన్ని ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ ద్వారా కొంత వరకు భర్తీ చేసుకునే అవకాశాన్ని కల్పించాం. ఈ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా 6 వేలకు పైగా క్లెయింలను పరిష్కరించాం. చాలామంది రిపేర్లు చేయించుకున్న తర్వాత క్లెయిమ్స్ చేయించుకోవాలని ఆగారు. రిపేర్ల ఆలస్యం కారణంగా క్లెయిమ్స్ ఆలస్యమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: రుణాలకు సంబంధించిన ప్రక్రియ ఎలా ఉంది?

సృజన: మూడు రోజుల్లో 2,740 ఖాతాలకు సంబంధించి రూ.157.85 కోట్ల విలువైన సేవలందించాం. ఇప్పటి వరకు 1,900 రుణ ఖాతాలకు సంబంధించి రూ.148.22 కోట్లను రీ షెడ్యూలింగ్ చేశాం. కొత్త రుణాల కోసం 840 ఖాతాలకు రూ.9.62 కోట్ల రుణాలను మంజూరు చేశాం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

హోరాహోరీగా షటిల్ పోటీలు

గన్నవరం, సెప్టెంబరు 21 : స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి షటిల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ పోటీల్లో పురుషుల 45ఏళ్లలోపు విభాగంలో 56 జట్లు తలపడుతున్నాయి. 45ఏళ్ల పైబడిన వెటరన్ విభాగంలో 24జట్లు పోటీ పడుతున్నాయి. ఈ పోటీల్లో రెండోరోజు శనివారం మ్యాచ్‌లను గొల్లనపల్లి జడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కేఎస్ జగదీశ్వరరావు ప్రారంభించారు. అనంతరం నాకౌట్ పద్ధతిలో రెండు విభాగాల్లో పోటీలు ఉత్కంఠంగా కొనసాగాయి. మూడు రోజులు పాటు జరిగే ఈ పోటీలు ఆదివారంతో ముగుస్తాయని అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్ తెలిపారు. పెదఅవుటపల్లికి చెందిన గుదె ప్రకాష్, వ్యాయామోపాధ్యాయులు రామారావు, రాంబాబు, బాలకృష్ణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి



రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తదితరులు

ఈడుపుగల్లు (కంకిపాడు), సెప్టెంబరు 21 : ప్రాధాన్యతాక్రమంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు లో శివాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు రూ. 20 లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఆయన సర్పంచ్ పందిపాటి ఇందిరతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ షకార్, పార్టీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, వార్డు సభ్యులు అనుమోలు రామకృష్ణ, షైనేని దుర్గాభవాని, సుంకర శ్రీహరి, బండారు ప్రవీణ, టీడీపీ నాయకులు చిన్నబాబు, సంగీతరావు, కాకుళ్ల సుధాకర్, మన్నే కృప, నాగ కోటేశ్వరరావు, బండారు నిరంజనరావు తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడులో మల్లవల్లి ఎడ్లకు ప్రథమస్థానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 21 : బండలాగుడు పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో మల్లవల్లికి చెందిన అక్కినేని ముకుల్ సత్య చౌదరి ఎడ్ల జత (వృషభరాజాలు) మొదటి స్థానంలో నిలచాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ పశు ప్రదర్శన, బండలాగుడు పోటీల్లో ఏవీఆర్ వృషభరాజాలు 20 నిమిషాల్లో 4,500 అడుగులు దూరం బండ లాగి ప్రథమ బహుమతి సాధించినట్టు పశుపోషకులు కృష్ణాజీ తెలిపారు.

టీడీపీ నేత వల్లభనేని భూషయ్యకు మాతృవియోగం



వల్లభనేని సత్య నాగ భానుమణి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గండిగుంట(ఉయ్యూరు), సెప్టెంబరు 21 : టీడీపీ నేత, రావ్ అండ్ రావ్ టైర్స్ అధినేత, గోసంరక్షుడు వల్లభనేని నాగభూషణరావు (భూషయ్య) మాతృమూర్తి వల్లభనేని సత్య నాగభానుమణి (76) శనివారం ఉదయం గండిగుంట నివాసంలో మృతి చెందారు. నాగభూషణరావు తండ్రి గండిగుంట దత్త ఆశ్రమ సభ్యుడు కృష్ణదాసు కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పలువురు పార్టీ నాయకులు, ప్రముఖులు సత్యనాగ భానుమణి భౌతికకాయం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆదివారం ఉదయం ఆమెకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఘనంగా గురజాడ జయంతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 21 : తెలుగు సాహిత్యాన్ని వ్యావహారిక భాషలో ప్రజలం దరికీ చేరువ చేసిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని హెచ్‌ఎం లూథర్‌పాల్ అన్నారు. రేమల్లె హైస్కూల్‌లో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం గురజాడ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశమంటే మట్టి కాదోయ్ మనుష్యులోయ్ అంటూ ప్రజలను ఉత్తేజితులను చేస్తూ దేశభక్తిని ప్రేరేపించిన అభ్యుదయ వాది గురజాడ అని జనవిజ్ఞాన వేదిక మండల కార్యదర్శి భాస్కరరావు అన్నారు.

15వేల మందికి ఉపాధి కల్పిస్తా

బాపులపాడులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 21 : మల్లవల్లి పారిశ్రామికవాడను అభివృద్ధి చేసి 15వేల మందికి ఉపాధి కల్పిస్తానని.. ఇది రాసి పెట్టుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. శనివారం బాపులపాడు, ఇందిరానగర్ సచివాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధితో హనుమాన్‌జంక్షన్ చాలా అభివృద్ధి చెందుతుందన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడను రాష్ట్రానికి తలమానికంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందించడానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయి కల్యాణి, వేమువల్లి శ్రీనివాసరావు, నూలు నరసింహారావు, గుండపనేని ఉమావరప్రసాద్, అట్లూరి శ్రీనివాసరావు, వడ్డి నాగేశ్వరరావు, ఈవో సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.



బాపులపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పేదలకు సకాలంలో సంక్షేమ పథకాలను అందిస్తూ రాష్ట్రాభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ గ్రామాధ్యక్షుడు లంక సురేంద్ర మోహన బెనర్జీ అన్నారు.



వీరవల్లిలో..

వీరవల్లిలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచి గురించి వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు నాయకుడు గుండపనేని ఉమావరప్రసాద్, మండాది రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కంకిపాడులో..

కంకిపాడు : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలుగు యువత జిల్లా కార్యదర్శి బొర్రా వెంకట్ అన్నారు. కంకిపాడులో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గాడిలో పెట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో ఇది మంచి ప్రభుత్వం

ఉయ్యూరు : పెన్షన్ పెంపు, అన్నక్యాంటీన్ల పునః ప్రారంభం, మెగా డీఎస్సీ వంటి ఎన్నికల హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల మనస్సులు చూరగొన్నదని టీడీపీ నాయకులు ఈడే ఆంజనేయులు, బూరెల నరేశ్ అన్నారు. ఉయ్యూరు నగరపంచాయతీ పరిధి వార్డుల్లో శనివారం పర్యటించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. 11 వార్డులో మాజీ వైస్ చైర్మన్ తుమ్మల శ్రీని వాసబాబు, 13వ వార్డులో మీసాల అప్పలనాయుడు సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటా ప్రచారం చేశారు.



ఉయ్యూరు 16వ వార్డులో..



కంకిపాడు సెంటర్‌లో నిరసన ప్రదర్శన

తిరుపతి ప్రసాదం అపవిత్రంపై నిరసన

కంకిపాడు, సెప్టెంబరు 21 : తిరుమల తిరుపతి దేవస్థానం స్వామి వారి ప్రసాదాన్ని అపవిత్రం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కంకిపాడు గ్రామస్థులు సెంటర్‌లో శనివారం పార్టీలకు అతీతంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, వెంకటేశ్వర స్వామితో పెట్టుకున్న వారు ఎవ్వరూ బతికి బట్టకట్టలేదని, జగన్ అధఃపాతాళానికి పడిపోవడానికి కారణం ఇదేనన్నారు. శ్రీవారి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బత్తుల కామేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, చలవాది రాజా, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, షేక్ బాజి, మురళి, రాంబాబు, ఏనుగ జయ, గుడిసేవ నాంచారయ్య, సుబ్బారావు, రామారావు, వడ్డాది శ్రీను, దివి రోహిణి, బాయిన నాగరాజు, దేవుడు, ఎర్రబోతు రామకృష్ణ, పిచుక రవి, అనిల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

24, 25న స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

హనుమాన్‌జంక్షన్,సెప్టెంబరు 21 : మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 24,25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు బాపులపాడు ఎంఈవో బి.సురేష్‌కుమార్ తెలిపారు. శనివారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పీడీలతో ఆటల పోటీల నిర్వహణపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. 24న బాలురు, 25న బాలికలకు మండల స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు బాపులపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు, మండల కో-ఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరావుకు తమ పేర్లు అందజేయాలని కోరారు. సమావేశంలో పీడీలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ మానవజాతి మనుగడకు పెనుముప్పు

ఉంగుటూరు, సెప్టెంబరు 21 : మానవజాతి మనుగడకు పెనుముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగంపై తేలప్రోలులో చేపట్టిన అవగాహనా ర్యాలీని ఆయన ప్రారంభించారు.

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులను సేకరించడం, స్వచ్ఛ క్లాస్ రూమ్‌లు, స్వచ్ఛ క్యాంపస్, గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దటం, పబ్లిక్ ప్రాంతాలు పరిశుభ్రంగా వుంచేలా ప్రజల్లో అవగాహన కల్పించటం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.కృపాకుమార్, వి.హరిగోపాలరావు పాల్గొన్నారు.



తేలప్రోలులో ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహనా ర్యాలీ



కేసరపల్లిలో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ

కేసరపల్లిలో

గన్నవరం : మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు శనివారం జరిగాయి. గ్రామాల్లో బ్లీచింగ్ జల్లటంతో పాటు పరిశుభ్రత చర్యలు చేపట్టారు. కేసరపల్లిలో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక మాట్లాడుతూ, ప్రజలు వ్యక్తిగత శుభ్రతకు ఎంత ప్రాధాన్యతనిస్తారో పరిసరాల పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుందని తెలిపారు. పంచాయతీకి గ్రామస్థులు కూడా సహకరించాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు శొంఠి కిషోర్, జాస్తి శ్రీధర్‌బాబు (చిన్ని), రాజులపాటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎం.మౌనిక, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్పొరేట్ వైద్యసేవలు అభినందనీయం

ఉప్పలూరు (కంకిపాడు), సెప్టెంబరు 21 :గ్రామీణ ప్రాంతాల పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందించేందుకు పిన్నమనేని ఆసుపత్రి యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. ఉప్పలూరులో గన్నవరం పిన్నమనేని ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈసీజీ, బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలను ఉచితంగా చేసి మందులను పంపిణీ చేసేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. జనరల్ మెడిసిన్ వైద్యులు అభిషేక్, సుజాత, దంత వైద్యులు పి. రమేష్‌బాబు, ఆర్థోపెడిక్ వైద్యులు రమేష్ రెడ్డి, యశ్వంత్, వైద్యులు వసంత, సుభాషిణి తదితరులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నే కేశవరావు, చలసాని రాధాకృష్ణ, పడవల మధుసూదనరావు, కొణతం సుబ్రహ్మణ్యం, కొండవీటి శివయ్య, కలపాల రాజేష్, మల్లేశ్వరరావు, వీరాస్వామి, చంద్రరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య

ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వాలి

ఉంగుటూరు, సెప్టెంబరు 21 : ఆపదల్లో వున్న వారికి చేయూత నివ్వాలని అప్పుడే ఆత్మసంతృప్తి లభిస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు, విశ్రాంత ప్రభుత్వ అధ్యాపకుడు దోనేపూడి రంగారావు అన్నారు. మండలంలోని కొయ్యగూరపాడులో జన్మించి, ఉద్యోగరీత్యా 48 ఏళ్ల క్రితం కైకలూరులో స్థిరపడిన ఆయన తన భార్య ప్రభావతితో కలిసి శనివారం స్వగ్రామం వచ్చారు. బుడమేరు వరదముంపులో ఇళ్లు మునిగిపోయి నిరాశ్రయులైన బాధితులకు తమవంతు సాయంగా సుమారు రూ. 40వేలు విలువజేసే 200 దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దోనేపూడి కృష్ణకుమారి, గ్రామపెద్దలు పోతినేని అజాద్, అబ్దుల్ హఫీజ్, జోజిబాబు, దోనేపూడి పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.



కొయ్యగూరపాడులో దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత దోనేపూడి రంగారావు, ప్రభావతి దంపతులు

నిత్యావసరాలు పంపిణీ

మండలంలోని ఎలుకపాడు, వెల్దిపాడు, చికినాల గ్రామాల్లో న్యూ అపోస్తలిక్ చర్చి ఇండియా సౌజన్యంతో 250 మంది వరద బాధితులకు అపోస్టల్ బి.ప్రభాకర్, బిషప్ ఎస్.విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులను స్వయంగా ఇంటింటికీ వెళ్లి అందజేశారు. జిల్లా రెక్టర్ రెవ.చిలకంటి వరప్రసాద్, సంఘ రెవ.మున్నంగి రాజారావు, వెల్దిపాడు సంఘ ప్రీస్ట్ మున్నంగి కనకరాజు, ప్రీస్ట్‌లు యర్రగుంట్ల సంజీవ్‌కుమార్, రూతు, కొలుసు గోపి, గద్దె రవికుమార్, పెనుమాల జోషిబాబు, బొకినాల యాకోబు, విశ్వనాథపల్లి పాపారావు, శ్రీకాకుళపు కిషోర్, ఎలుకపాడు మాజీ సర్పంచ్ మున్నంగి నిరీక్షణరావు పాల్గొన్నారు.



జంక్షన్ సీఐటీయూ కార్యాలయంలో నిత్యావసరాల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ : ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సామాజిక బాధ్యతగా ప్రజలకు యూటీఎఫ్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆరుగొలను, రామన్నగూడెం, ఓగిరాల, కాకులపాడు గ్రామాలకు చెందిన 40 బాధిత కుటుంబాలకు యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను ఉమామహేశ్వరరావు చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నీలం ప్రభాకర్, వెలమర్తి రవిబాబు, కలపాల తాతబాబు, పి.జగతి, ఎమ్మెస్సార్ ప్రసాద్, విజయకుమారి, చలపతి, నాగరాజు, బేత శ్రీనివాసరావు, నల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555

బుడమేరు వరద మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం



మచిలీపట్నం టౌన్ : బుడమేరు వరదల్లో మృతి చెందిన బందరు మండలం హుస్సేన్‌పాలెం గ్రామానికి చెందిన కలిదిండి ఫణికృష్ణ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును మంత్రి కొల్లు రవీంద్ర శనివారం అందజేశారు. హుస్సేన్‌పాలెం గ్రామంలో మృతుడి భార్య జ్యోతిని మంత్రి రవీంద్ర పరామర్శించి ఆత్మస్థైర్యం నింపారు. ఇద్దరు ఆడపిల్లల చదువుకు సాయం అందిస్తామన్నారు. మోటమర్రి బాబా ప్రసాద్, కుంచే నాని, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చిన మంచి ప్రభుత్వం



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల, రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 21 : ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తూ వంద రోజుల్లోనే సీఎం చంద్రబాబు మంచి పాలన అందించారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న బూసరపు వాకాలమ్మకు సీఎం సహాయనిధి నుంచి రూ. 2.50 లక్షల చెక్కును మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కొనకళ్ళ బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, నారాయణ ప్రసాద్, ఐపీసీ కరుణకుమార్, ఇలియాస్ పాషా, కాంతారావు, కుంచే నాని, సోడిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.



చల్లపల్లిలో మొక్క నాటి, ఘంటసాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి

స్వేచ్ఛతో కూడిన పరిపాలన : ఎమ్మెల్యే మండలి

చల్లపల్లి : కూటమి ప్రభుత్వం ప్రజలకు స్వేచ్ఛతో కూడిన పరిపాలన అందిస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లిలో ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ, వరదల్లో చేసిన సేవే ప్రధానమైనదని తెలిపారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కనపర్తి శ్రీనివాసరావు, విజయరాధిక, మోర్ల రాంబాబు, వెంకటేశ్వరమ్మ, చినరాట్నాలు, మేకా బంగారుబాబు, సీఐ ఈశ్వరరావు, ఎస్సై సుబ్రహ్మణ్యం, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు రూపొందించిన మా మంచి ప్రభుత్వం..మా మంచి ఎమ్మెల్యే ప్లకార్డులను ఆవిష్కరించారు. పంచాయతీ ఆవరణలో మొక్క నాటారు. **ఘంటసాల** : ప్రతి వ్యక్తికి స్వేచ్ఛ, ఆత్మగౌరవం ముఖ్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాలలో ఇది మంచి ప్రభుత్వం గ్రామసభలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తుందన్నారు. గ్రామసభలు విజయవంతం చేసిన సర్పంచ్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, ఎంపీడీవో కె.జె.శ్రీనివాస్ చంద్, తహసీల్దార్ విజయ ప్రసాద్, సర్పంచ్ బాణావత్ వెంకటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, మిల్క్ యూనియన్ డైరెక్టర్ వేమూరి సాయి వెంకట రమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



భట్లపెనుమర్రులో స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ప్రజలు ఆశీర్వదించిన ప్రభుత్వం : కుమార్‌రాజా

కూచిపూడి : ఇది ప్రజలు ఆశీర్వదించిన మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. భట్లపెనుమర్రులో ఆయన పాల్గొని మాట్లాడారు. లింగమనేని రామలింగేశ్వరరావు, తాడిశెట్టి నరేష్, ఎంఈవో సుధా ప్రవీణ్, తహసీల్దార్ మస్తాన్, వీరంకి తులసీదాస్, గొట్టిపాటి శ్రీధర్, అధికారులు, పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్ చిత్రాలకు పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

చంద్రబాబు, పవన్ చిత్రాలకు పాలాభిషేకం

పామర్రు : బీసీలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి సిఫార్సు చేయడంతో పాటు, బీసీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తదితర సానుకూల నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే కుమార్ రాజా ఆధ్వర్యంలో పాలభిషేకం చేశారు. వీరంకి పరశురామ్, దానబోయిన వెంకటనారాయణ, వీర్లనరేష్, నాగరాజు, జన్ను శోభనబాబు, పానుగంటి సందీప్ తాత నారాయణరావు, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక** : వంద రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి మత్స్యకారులు అభినందనలు తెలిపారు. మత్స్య భవనం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి, టీడీపీ జిల్లా నేత లకనం నాగాంజనేయులు, మత్స్యకారుల సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, కొల్లు నాగబాబు, కొల్లు సత్యనారాయణ, సందాడి నాగరాజు, బి.వెంకటేశ్వరరావు, లంకే బుల్లి బసవయ్య తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని టి.కొత్తపాలెం, పెదపాలెం గ్రామపంచాయతీల్లో శనివారం అధికారులు, సిబ్బంది అభివృద్ధిని వివరించారు. టి.కొత్తపాలెం సర్పంచ్ బండ్రెడ్డి శివపార్వతీ, శ్రీనివాస్, పెదపాలెం సర్పంచ్ దున్నా రాజేష్, ఎంపీడీవో కె.సీతారామకుమార్, ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, పంచాయతీ కార్యదర్శులు పులి విజయ్ కుమార్, వెన్న కుమార్, సచివాలయ, ఉపాధిహామీ పథకం సిబ్బం ది పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని తుంగలవారిపాలెంలో నిర్వహించారు. కరపత్రాలు అందజేశారు. భోగిరెడ్డి బుజ్జిబాబు, గంగు అర్జునరావు, చుండూరు రమేష్, మాదివాడ పవన్ కుమార్, గుడివాక రామాంజనేయులు, అందె గోపాలకృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి** : కె.కొత్తపాలెంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవ, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి అభివృద్ధిని వివరించారు. **గుడివాడ రూరల్** : మల్లాయిపాలెం-1లో ఇన్‌చార్జి ఎంపీడీవో త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈవోపీఆర్డీ డి.వెంకటేశ్వరరావు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. **నందివాడ** : జనార్దనపురంలో టీడీపీ నేతలు మర్రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గౌడపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి వంద రోజులు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఇంది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను పంపిణీ చేశారు. గూడపాటి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పెడన** : బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం నెరవేర్చిన, నెరవేర్చనున్న హామీలను వివరించారు. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలతో కూడిన స్టిక్కర్లను ఇంటింటికీ అంటించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టండి : కాగిత



కృత్తివెన్ను : వైసీపీ తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కూటమి నాయకులకు పిలుపునిచ్చారు. కృత్తివెన్ను పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఒడుగు తులసీరావు, కూనసాని చిన్న, నాగిడి చెన్నకేశవరావు, కూనసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవా కార్యక్రమాలు

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు లయన్స్ సేవాభవన్‌లో నిర్వహించారు. లయన్ కొల్లి రాజేష్ ఆర్థిక వితరణతో గుడివాడ లయన్స్ నేత్రవైద్యశాల సహకారంతో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. 30 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా వారిలో 10 మందికి శస్త్రచికిత్స అవసరంగా గుర్తించారు. వారికి గుడివాడ లయన్స్ నేత్రవైద్యశాల వారిచే ఉచితంగా ఆపరేషన్ చేయిస్తారు. జంగం కృష్ణమూర్తి సతీమణి జంగం కల్యాణి జ్ఞాపకార్థం మనవడు నవీన్ కుమార్ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షురాలు శశికళ, కార్యదర్శి పెరుమాళ్ళు, జంగం మోహనరావు, జాస్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పోలవరపు వెంకటరావు, వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, పొట్లూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో నేత్ర వైద్యశిబిరం

చల్లపల్లి : చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం జరిగింది. కోస్టల్ ఫీడ్స్ అధినేత లయన్ కాట్రగడ్డ రామ్మోహనరావు ఆర్థిక సహకారంతో జరిగిన శిబిరంలో డాక్టర్ వెంకట్రావ్ 55 మందికి పరీక్షలు నిర్వహించి 14 మందిని ఆపరేషన్లకు ఎంపికచేశారు. క్లబ్ కార్యదర్శి కస్తూరి వరప్రసాద్, కోశాధికారి ముమ్మనేని నాని, పెద్దలు నర్రా సాయిబాబు, ఏఎల్ఆర్‌కె.ప్రసాద్, కొల్లిపర మధు, కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు, కంఠంనేని సుధాకరరావు, ఉప్పల సాంబశివరావులు పర్యవేక్షించారు.

తిరుపతి లడ్డూ అపవిత్రంపై టీడీపీ ఆగ్రహం

చల్లపల్లి, సెప్టెంబరు 21: తిరుపతిలో లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన సంఘటనపై చల్లపల్లిలో టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. జంతువు కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యిని సరఫరా చేసిన వైనంపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఆందోళన చేశారు. మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, పైడిపాముల కృష్ణకుమారి, ముమ్మనేని నాని, షేక్ నబీషోరి, జల్లూరు ప్రసాద్, రావి చిట్టి, గొరిపర్తి సుబ్బారావు, పరిశె మౌళి, మార్గాని చంద్రం, తాతా ప్రదీప్, తుమ్మలగుంట గోపాల కృష్ణ, కోట సత్యనారాయణ, రావి రత్నగిరి, గుత్తికొండ వంశీకృష్ణ, బీజేపీ నేతలు పిండి రేవతి, మంచికంటి కిరణ్, జనసేన నేత రంజిత్ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు** : తిరుపతి లడ్డూ ప్రసాదం అపవిత్రం కావటంపై మండల టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడూరు ప్రధాన సెంటర్‌లో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. బండే శ్రీనివాసరావు, బడే భావన్నారాయణ, మద్దూరి కాంతారావు, ఉల్లి శేషగిరిరావు, పిల్లి మల్లిఖార్జునరావు, కడవకొల్లు శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, బచ్చు వెంకటేష్, గోగినేని సోమశేఖరరావు, ముద్దినేని చంద్రరావు, గుడిసేవ సూర్యనారాయణ, బొల్లిశెట్టి విఠల్‌రావు, పాండురంగారావు, పోతురాజు, వీరంకి వెంకన్న, దావు మల్లి, రవీంద్ర పాల్గొన్నారు.



చల్లపల్లిలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కూటమి నేతలు

కోడూరులో జగన్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన

వేద పండితుల నిరసన



గుడివాడ : కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద పట్టణంలోని వేదపండితులు, బ్రాహ్మణ సంఘాల నాయకులతో కలిసి నిరసనగా తెలిపారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, అగ్నిహోత్రం ఫణిగోపాల్, భారతుల రమణమూర్తి, లంకా గిరిచంద్ర, సాతులూరి అనిల్‌కుమార్, చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, వేదాంతం విజయసారథి, వేదాంతం అప్పలాచారి, కొమండూరి చక్రవర్తి, కొమ్ము వెంకటేశ్వర్లు, ఉపద్రష్ట రావస్వామి శాస్త్రి, వై.వి.ఆర్ గోపాల్, వి.రమణారావు, కొంకేపూడి రమణరావు, మొక్కపాటి సూర్యం పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి : తలశిల

నాగాయలంక : లడ్డూ ప్రసాదంలో కల్తీకి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. **మచిలీపట్నం టౌన్** : లడ్డూ ప్రసాదం అపవిత్రం కావడంపై జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొండి కృష్ణయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యాదవ సేవా సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బచ్చుల బోసుబాబు, బోయిన సత్యనారాయణ, గొరిపర్తి రామ్మోహన్, వెంకట కృష్ణారావు, బచ్చుల హరి, నాంచారయ్య, నరేంద్ర, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మండల సమావేశం 24న

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో మరియకుమారి తెలిపారు. ఎంపీపీ తుంగల సుమతి దేవి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాల్సిందిగా ఆమె కోరారు.

సముద్రాన్ని కాలుష్యం నుంచి కాపాడుకుందాం



సాగర్ స్వచ్ఛ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత   హంసలదీవి బీచ్‌లో మైరైన్ సిబ్బంది

కృత్తివెన్ను : సముద్రాన్ని కాలుష్యం నుంచి మనమే కాపాడుకోవాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్వచ్ఛ సాగర్ కార్యక్రమంలో భాగంగా పెదగొల్లపాలెం, ఒర్లగొందితిప్ప బీచ్‌లో తీరం వెంబడి శుభ్రం చేశారు. ఇన్‌కాయిస్, హైదరాబాద్ సంస్థ, మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇన్ కాయిస్ సంస్థ ప్రతినిధి మొయిన్, మెరైన్ సీఐ వసంత బాబు, ఎస్సై రవివర్మ, మండల టీడీపీ అధ్యక్షుడు ఒడుగు తులసీరావు, సర్పంచ్ బస్వాని బంగార్రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **కోడూరు** : హంసలదీవి బీచ్ వద్ద పరిసరాలను పాలకాయితిప్ప మెరైన్ పోలీస్ సిబ్బంది శుభ్రం చేశా రు. మెరైన్ సీఐ సురేష్ రెడ్డి, ఎస్సై ఉజ్వల్ కుమార్, రైటర్ రెహమాన్ జానీ, పాలకాయితిప్ప కోస్టల్ సెక్యూరిటీ పో లీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్** : మంగినపూడి బీచ్‌లో శనివారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌కె కళాశాల విద్యార్థులతో పా టు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ సేవలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో స్వచ్ఛతా హి సేవ

మచిలీపట్నం టౌన్ : ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సహకరించాలని జిల్లా రవాణాశాఖాధికారి వాణిశ్రీ అన్నారు. శనివారం మచిలీపట్నం ఆర్టీసీ డిపో వద్ద నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ నాయకుడు పి.వి. ఫణికుమార్, కొనకళ్ల భాను, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి** : స్వచ్ఛ గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా మొవ్వలో చీపర్లు పట్టి రోడ్లు శుభ్రం చేశారు. గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఎంపీడీవో సుధా ప్రవీణ్, తహసీల్దార్ మస్తాన్, ఎంఈవో శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



జీవో 85 రద్దు చేయాలని ఆందోళన


మచిలీపట్నం టౌన్ : జీవో నెంబరు 85ను రద్దు చేయాలంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు శనివారం నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద జరిగిన నిరసన ప్రదర్శనలో డాక్టర్ శివరామకృష్ణ మాట్లాడారు. జీవో 85 వల్ల పీజీ కోర్సుల్లో ఇన్‌సర్వీసు వైద్యు లు నష్టపోతారని, పాత పద్ధతిలోనే ఇన్‌సర్వీసు వైద్యులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

అలరించిన భక్త చింతామణి



నాగాయలంక : వినాయక ఉత్సవ పందిరిలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన భక్త చింతామణి నాటకం అలరించింది. చింతామణి గా రత్నశ్రీ అభినయం ఆకట్టుకుంది. సుబ్బారావు పాత్రలో అద్దంకి శ్రీనివాసరావు, శ్రీహరి పాత్రలో ఎస్.కె.సిలార్ హాస్యభరిత నటనతో మెప్పించారు. బిల్వమంగళుడి పాత్రలో పి.ఫణికుమార్, భవానీ శంకర్ పాత్రలో సొర్లగొందికి చెందిన కె.రామ్ కుమార్ అభినయించి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. కళాకారులును ఆదరించి ప్రోత్సహిస్తున్న శ్రీరామపాదక్షేత్రం ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావును రంగస్థల కళాకారుల బృందం, ప్రసన్న గణపతి దేవస్థానం ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు అభినందించారు. మండవ బాలవర్థిరావు తదితరులు పర్యవేక్షించారు.

అవనిగడ్డ టీడీపీ పరిశీలకుడిగా కనపర్తి



అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావును అధిష్ఠానం నియమించింది. పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని కనపర్తి తెలిపారు.

కొమరవోలుకు ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

పామర్రు : ఎమ్మెల్యే కుమార్ రాజా చొరవతో కొమరవోలుకు ఆర్టీసీ బస్సు సర్వీసును శనివారం పునరుద్ధరించారు. గవర్నర్‌పేట-2 డిపో నుంచి 333కె సర్వీసును ప్రారంభించారు. విజయవాడ నుంచి ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 3.50 గంటలకు ప్రతిరోజూ ఈ బస్సు బయలు దేరే విధంగా రూట్ మ్యాప్ రూపొందించారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్ షేక్ జానీ కోరారు. కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, సర్పంచ్ కాకరాల హరిబాబు, యెర్నేని అరవింద్ బాబు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



సామూహిక సీమంతం

పెడన : గూడూరు మండల వెలుగు కార్యాలయంలో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీవో గ్లోరీ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకులు గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, సిరివెళ్ళ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునీటి ప్రవాహానికి అడ్డుకట్ట

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కోడూరు : ఉప్పునీరు ముంచుతోంది శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్, ఏఈ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉప్పునీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసే పనులు ప్రారంభించారు. ఊడిపోయిన గేటు స్థానంలో ఇసుక మూటలు వేసి ప్రవాహాన్ని అరికట్టారు. రెండో గేటును సరి చేసే ప్రయత్నం చేయగా, వంతెన శిథిలావస్థకు చేరటంతో లాకుకు ఉన్న వెల్డింగ్ ఊడిపోయి ప్రయత్నం విఫలమైంది. ఈ పనులను కూటమి నేతలు బండే శ్రీనివాసరావు, ఉల్లి శేషగిరిరావు, గోగినేని సోమశేఖరరావు, బచ్చు వెంకటేష్, బండే వెంకటేశ్వరరావు పరిశీలించారు.